# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 14 డిసెంబరు, 2025 | పేజీలు :04


## క్రీడలకు మునిసిపల్ శాఖ సహకారం




**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** మునిసిపల్ పరిధిలో జరిగే క్రీడలకు తమశాఖ సహకారం ఎల్లవేళలా ఉంటుందని పెద్దపల్లి మునిసిపల్ కమీషనర్ ఆకుల వేంకటేష్ అన్నారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరగబోయే పెద్దపల్లి ప్రీమియర్ లీగ్ పోస్టరును శనివారం ఆవిష్కరించిన ఆయన అనంతరం మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారుల్లో దాగున్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంటులు ఉపయోగపడుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. పిపిఎల్ నిర్వాహకులు రాధాస్వామి, క్రాంతిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సతీష్, టిపిఎస్ వినయ్, సాబీర్ ఖాన్, రేవల్లి స్వామి, కానుకుర్తి కార్తీక్, బండి అనిల్, బూత్కూరి రాజేష్, శంకర్,తదితరులు పాల్గొన్నారు.

# సారంపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా తంగళ్ళపల్లి మండలంలోని సారంపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు చేసిన ఏర్పాట్లను సందర్శించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో ఎందరు ఓటర్లు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు కోసం సిద్ధం చేసిన వీల్ చైర్, ఇతర సౌకర్యాలు పరిశీలించారు. ఓటింగ్, పూర్తి అయిన తర్వాత చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. పరిశీలనలో సీపీఓ శ్రీనివాసాచారి, తహసీల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ, ఎంపీఓ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్..**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఎస్ ఈ సీ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆయా గ్రామాలకు కేటాయించిన వాహనాల్లో అధికారులు, సిబ్బంది సామగ్రితో తరలి వెళ్లారు. కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాసాచారి, డీపీఓ షరీఫుద్దిన్, ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ, ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం




**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** రెండవ విడత ఆదివారం జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. రమేష్ తెలిపారు. శనివారం రోజున జగిత్యాల అర్బన్ మండలంలో ఆదివారం జరగనున్న రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎలక్షన్ మెటీరియల్ పంపిణీని పరిశీలించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరియల్ ని జగిత్యాల జిల్లా ఎన్నికల సాధారణపరిశీలకులు జి. రమేష్ చెక్ చేశారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిశీలించారు.జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జి.రమేష్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని,త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా నోడల్ అధికారులు పి.నరేష్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రాం మోహన్, జగిత్యాల అర్బన్ ఎంపిడివో విజయ లక్ష్మి,జగిత్యాల రూరల్ ఎస్ఐ ఉమా సాగర్, జగిత్యాల అర్బన్ ఎంపివో వాసవి, జోనల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# చిత్రహింసల వల్లనే కోదాడ యువకుడి మృతి

### కేసుకు నమోదుకై మంద కృష్ణ మాదిగ డిమాండ్

**ప్రజాపక్షం/గోదావరిఖని :** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన దళిత యువకుడు కర్ల రాజేష్ పోలీసుల చిత్రహింసల వల్ల మృతి చెందారని, ఈ ఘటనకు కారకులైన పోలీసులపై హత్య కేసుతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఎన్‌టిపిసి జ్యోతిభవన్‌లో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌ను రాజేష్ తల్లి లలితమ్మ, టిపిసిసి నాయకులు పెర్క శ్యామ్‌లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఏలాంటి ఫిర్యాదు లేకుండానే నవంబర్ 4 నుంచి 10వ తేది వరకు రాజేష్‌ను అక్రమంగా పోలీస్ కస్టడిలో ఉంచి తీవ్ర చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. చట్ట విరుద్ధమైన కస్టడి, తగిన వైద్యం అందించకపోవడమే రాజేష్ మృతికి కారణమని తెలిపారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాలు పూర్తిగా అసత్యమన్నారు. బాధితుడి తల్లి మూడుసార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన నేటి వరకు కేసు నమోదు చేయకపోవడం దళిత కుటుంబంపై జరుగుతున్న వివక్షేనని విమర్శించారు. ఈ ఘటనపై చిలుకూరు ఎస్ఐ, కోదాడ రూరల్ సిఐలను తక్షణమే సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రాజేష్ మృతదేహానికి నిపుణులైన ఫోరెన్సిక్ వైద్యులతో రీ పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చిలుకూరు, కోదాడ రూరల్, అనంతగిరి పోలీస్ స్టేషన్లలోని సిసి టివి ఫుటేజ్‌లు, రాజేష్ పనిచేసిన పెట్రోల్ బంక్ వీడియో ఫుటేజ్‌లు, ఈ కేసులో సహ నిందితుల కాల్ డేటా బయటపెడితే నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. కోదాడకు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌ను మందకృష్ణ మాదిగ కోరారు.



# బిసి రిజర్వేషన్లకు బిజెపి అడ్డు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఓబీసీ రిజర్వేషన్లు పార్లమెంట్ ప క్రియా ద్వారా సాధించేందుకు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ఉద్యమం నడిపేందుకు రాహుల్ గాంధీ నేతృత్వంలో వ్యూహరచన జరుగుతుందని ఓ బి సి ఉద్యమకారులు తాడూరి శ్రీమన్నారాయణ తో పాటు గుంటి స్వరూప కృష్ణ, మల్లికార్జున, హసీనా తెలిపారు. శనివారం న్యూఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయం సందర్శించి జాతీయ స్థాయిలో ఓబిసి ఉద్యమం ఆవశ్యకతపై ఏఐసిసి అగ్ర నాయకులకు వివరించినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీమన్నారాయణ తెలిపారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వము లో 42 శాతం రిజర్వేషన్ల సాధనకై అసెంబ్లీ గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి బిల్లు పంపిన ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశ పెట్టలేదని శ్రీమన్నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ బిల్లుపై పార్లమెంటులో రాహుల్ గాంధీ ప్రస్తావించాలని ఏఐసిసి పెద్దలను కోరినట్లు తాడూరి శ్రీమన్నారాయణ తెలిపారు.రాష్ట్రపతికి పంపిన బిసి బిల్లును బిజెపి భాగస్వామ్య ప్రభుత్వం అడ్డుకుంటుందని, తెలంగాణలో 8 మంది బిజెపి ఎంపీలు 42% రిజర్వేషన్లపై పార్లమెంట్లో ప్రస్తావించకపోవడం సిగ్గుచేటనీ, బీసీ ప్రధానమంత్రి అయిన మోడీ 50% బీసీ సీలింగ్ను రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించాలని శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు.

రాహుల్ గాంధీ ద్వారానే చట్టసభలతో పాటు స్థానిక సంస్థలలో ఓబీసీ రిజర్వేషన్ల సాధన జరుగుతుందని భారత ప్రజలు ఎదురుచూస్తున్నట్లు వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

## 8వార్డు సభ్యుడికి ఘన సన్మానం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మేజర్ గ్రామపంచాయతీ 8వ వార్డ్ మెంబర్ గా ఘన విజయం సాధించిన ముష్కరి రమేష్ ను శనివారం పలువురు యువకులు ఘనంగా సన్మానించారు. ప్రత్యర్థిపై 80 ఓట్ల తో ఘనవిజయం సాధించడం అభినందనీయమని కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో లింగస్వామిగౌడ్, సంతోష్, లక్ష్మ ణ్, రాకేష్ తదితరులున్నారు.

## మల్యాల మండలంలో రెండో విడుత పోరు నేడే

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం లో రెండో విడుత పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది.ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్ జరగనున్నది.శనివారం ఉదయం మల్యాల మండల పరిషత్ ఆవరణలో పోలింగ్ అధికారులకు ,సిబ్బందికి బ్యాలెట్ పత్రాలు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. మల్యాల మండలం లో మొత్తం 40307 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 19150 పురుషులు, 21155 మంది మహిళలు ఉన్నారు.

## నూతన సర్పంచుకు ఆత్మీయ సన్మానం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేముల కుర్తి గ్రామంలో ఇటీవలే జరిగిన పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో వేముల కుర్తి గ్రామ సర్పంచ్ గా తరి రామానుజం విజయం సాధించారు. ఈ సందర్భంగా శనివారం యమాపూర్ సింగిల్ విండో చైర్మన్ అంకతి రాజన్న వేముల కుర్తి గ్రామానికి చెందిన ఇతర నాయకులు నూతన సర్పంచ్ రామానుజమును మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఆత్మీయ సన్మానం చేశారు. సన్మానం చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు పెంట లింబాద్రి, పుప్పాల నాగేష్, వదాస్ వెంకటాద్రి ప్రభాకర్, బుచ్చన్న, నాగరాజ్, తదితరులున్నారు.

## కేశపూర్ సర్పంచుకు ఆత్మీయ సన్మానం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేశపూర్ కు చెందిన బోనగిరి స్వాతి భూమేష్, ఇటీవలే మొదటి విడత పంచాయతీ ఎన్నికలలో కేశపూర్ సర్పంచ్ గా విజయం సాధించారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నెమూరి సత్యనారాయణ, మాజీ కోఆప్షన్ మెంబర్ ఏలేటి చిన్నారెడ్డి లు కేశపూర్ నూతన సర్పంచ్ బోనగిరి స్వాతి భూమేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## లేడీస్ క్లబ్ మహిళలకు ఆటల పోటీలు



**ప్రజాపక్షం/రామగిరి:** సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక సిఎన్‌సిఓఎ క్లబ్ నందు మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలను లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీమతి అలివేణి సుధాకరరావు ప్రారంభించారు. వీటిలో భాగంగా మహిళలకు బాల్ ఇన్ ద సర్కిల్, బాంబింగ్ ద సిటీ, స్టిక్ ఇన్ ద హ్యాండ్ మొదలగు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనడం చాలా సంతోషమని, ఇలాంటి పోటీలను సింగరేణి సంస్థ గత కొద్ది సంవత్సరాలుగా నిర్వహిస్తుందని అన్నారు.ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు స్థానిక రాణి రుద్రమ దేవి క్రీడా ప్రాంగణం నందు ఈనెల 23న సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న సింగరేణి దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయబడునని తెలియజేశారు. సింగరేణి దినోత్సవ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి హరిణి,గేమ్స్ సెక్రటరీ లావణ్య, కల్చరల్ సెక్రెటరీ కోమలి, కమిటీ మెంబర్ నిఖిత, కోఆర్డినేటింగ్ ఆఫీసర్ పి.రాజేశం, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం..!



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి తాము మంచితనంతో చేసిన సేవలను గుర్తిస్తూ.. ఆదరించి తమను సర్పంచ్ గా గెలిపించారని పోతి పెద్ది కవిత కిషన్ రెడ్డి అన్నారు. ఓడేడ్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా గెలుపొందిన కవితకిషన్ రెడ్డి శనివారం మాట్లాడుతూ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సహకారంతో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. తాము ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతూ గ్రామాభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. గతంలో తాను సర్పంచిగా,ఎంపిటిసిగా పని చేశామని అలాగే తన సతీమణి కవిత ఎంపిటిసిగా ఉన్న పదవీ కాలంలో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. మళ్లీ గ్రామానికి సేవ చేసేందుకు సర్పంచ్ గా గెలిపించి అవకాశం కల్పించిన గ్రామస్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని కవిత కిషన్ రెడ్డి అన్నారు.గ్రామాభివృద్దే లక్ష్యంగా పనిచేస్తా సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి* ఓడేడ్ గ్రామభివృద్దే ధ్యేయంగా పనిచేస్తామని కవిత కిషన్ రెడ్డి అన్నారు. అలాగే గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

## వామ్మో ఇదేమి రోడ్డు..!



**ప్రజాపక్షం/ముత్తారం :** రోడ్డు వల్ల వచ్చే దుమ్ము, ధూళితో ప్రజలు శ్వాసకోశ వ్యాధులు (దగ్గు, ఆస్తమా) కంటి సమస్యల తోపాటు పలు రకాల అనారోగ్యానికి గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంఓడేడు నుండి మంథని వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అయితే రోడ్డు గుంతలను పూడ్చేందుకు మట్టినిపోశారు.ఈ మేరకు రోడ్డుపై వాహనాలు నడుస్తుంటే దుమ్మురేగి ప్రయాణాలకు ఇబ్బందులు కలిగిస్తోంది.ముత్తారం మండలంలోని కేషనపల్లి,దర్యాపూర్, ముత్తారం,కాసర్ల గడ్డ చెందిన గ్రామస్తులకు, ప్రయాణికులకు రోడ్డుపై ప్రయాణం చేస్తుంటే దుమ్ము, ధూళితో పొగ మంచులా కనిపిస్తుంది. ఈ రోడ్డుపై ప్రజలు ప్రయాణించాలంటే ఆరోగ్య సమస్యలు, శ్వాస కోస వ్యాధులు వస్తాయెమోనన్న భయంతో ఈ రోడ్డుకు రావటానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క రహదారి పనులు జరుగుతున్నప్పటికీ మరో పక్క దుమ్ము దూలి కారణంగా ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ దుమ్ము, ధూళి వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పనులను అధికారులు పర్యవేక్షించకపోవడం వల్ల ఎటువంటి నిబంధనలూ పాటించడం లేదని పలు గ్రామాలకు చెందిన గ్రామస్తులు వాపోతున్నారు.ఈ దుమ్ము ధూలితో స్థానికంగా నివసిస్తున్న వారు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత శాఖల అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడంతో పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రహదారి పక్కన ఉన్న షాపులోకి క్షణాల్లో దుమ్ము, ధూళి చేరుతుందని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల ఊపిరితిత్తులపై తీవ్రంగా ప్రభావం పడుతుందని వివిధ శ్వాసకోశ వ్యాధులు, అలర్జీ ప్రతి చర్యలకు కారణం అవుతుందని దుకాణాదారులు చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారి పై వాటర్ సర్వీస్ చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు, వ్యాపారులు కోరుతున్నారు.

## సర్పంచ్‌ని సన్మానించిన జబర్దస్త్ కళాకారుడు



**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రముఖ జబర్దస్త్ కళాకారుడు మంథని శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ నూతన సర్పంచిగా ఎన్నికైన నక్క రాజేశ్వరి రాజయ్య తోపాటు వార్డు సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం గ్రామస్తులతో ముచటిస్తూ గ్రామ అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అందించాలని కోరారు.జబర్దస్త్ కళాకారుడు శ్రీనివాస్ వెంట వారి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించండి..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించండని జిల్లాకాంగ్రెస్ కార్యదర్శి వంగగిరిధర్‌రెడ్డి కోరారు.మేజర్ గ్రామపంచాయితి ఎన్నికలలో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తే అభివృద్ధి పనులు జరుగుతాయని అన్నారు.కత్తెర గుర్తుకు ఓటు వేయాలని అన్నారు. కార్యక్రమంలో వంగగిరిధర్‌రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి,నందికిషన్, కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

## నూతన సర్పంచు, ఉప సర్పంచులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఇటీవలే జరిగిన మొదటి విడత పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో ఇబ్రహీంపట్నం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా బద్దం గోపి ఎన్నిక కాగా ఉప సర్పంచ్ గా నాంపల్లి రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శనివారం తిమ్మాపూర్ కు చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నోముల రంజిత్ రెడ్డి, లక్వతి రెడ్డి, మండల కేంద్రానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నూతన సర్పంచి బద్దం గోపిని ఉప సర్పంచ్ లు నాంపల్లి రమేష్, తిమ్మాపూర్ ఉప సర్పంచ్ ముక్కెర సతీష్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నెమూరి సత్యనారాయణ మాజీ కో ఆప్షన్ మెంబర్ ఏలేటి చిన్నారెడ్డి, జెడి సుమన్, జింక శ్రీనివాస్, రాజశేఖర్, విపుల్, మహేష్ తదితరులున్నారు.

## నూతన సర్పంచుకు ఆత్మీయ సన్మానం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ కు చెందిన బాస శ్రవణ్ ఇటీవలే మొదటి విడత పంచాయతీ ఎన్నికలలో తిమ్మాపూర్ సర్పంచ్ గా విజయం సాధించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం కు చెందిన నెమూరి సత్యనారాయణ, మాజీ కోఆప్షన్ మెంబర్ ఏలేటి చిన్నారెడ్డిలు శనివారం భాస శ్రవణ్ తోపాటు మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ సన్మానం చేశారు.సన్మానించిన వారిలో నోముల రంజిత్ రెడ్డి, లక్వతి రెడ్డి, సుంకేం రాజశేఖర్, విపుల్ చందు, గ్రామస్తులు తదితరులున్నారు.

## దుర్గం నగేష్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాపక్షం/గోదావరిఖని : సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకుడు, సమతా ఫౌండేషన్ ఛైర్మన్ మార్షల్ దుర్గం నగేష్(నాగేశ్వర్‌రావు)కు అమెరికా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటి(జిహెచ్‌యు) వారు చెన్నైలో గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. శనివారం అమెరికా గ్లోబల్ యూనివర్శిటి వార్షిక మహోత్సవ వేదికపై ఈ డాక్టరేట్‌ను అందజేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గత 20 ఏళ్లుగా నగేష్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ అవార్డును ప్రధానం చేసినట్లు వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ పి.మాన్యువెల్ తెలిపారు. ఈ సందర్భంగా నగేష్‌ను పలువురు అభినందించి సంతోషం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాభివృద్ధి

**ప్రజాపక్షం/మందమర్రి :** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బానోతు నిలయ అన్నారు. మందమర్రి మండలంలోని వెంకటాపూర్, మామిడిగట్టు, పొన్నారం గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్మిక మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కొట్టే సంపత్, మాసు సంతోష్, గజ్జె భాను లను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, వివిధ సంక్షేమ పథకాలు అర్హులు అందరికీ అందుతున్నాయని తెలిపారు. ఆరు గ్యారంటీ పథకాలు ఇప్పటికే ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని, మంత్రి వివేక్ వెంకటస్వామి నాయకత్వంలోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి కొట్టే సంపత్, ఎస్సి సెల్ పట్టణ అధ్యక్షులు నెరువట్ల, మైనార్టీ పట్టణ అధ్యక్షులు జమీల్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎండి సుకూర్, నాయకులు ఎర్ర రాజు, ముదారపు శేఖర్, శ్రీనివాస్, మరాటి శంకర్, రాంటెంకి దుర్గమ్మ, జాడి



పోచమ్మ, పాయిరాల శ్రీనివాస్, అరుణ్, కుమ్మరి తిరుపతి, జుమ్మిడి శ్రీనివాస్, రెడ్డి లింగయ్య, తిరుపతి రాజేందర్, సంతోష్ పాల్గొన్నారు.

# శాంతియుత ఎన్నికల నిర్వహణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం

### జిల్లా ఎస్పి జానకి షర్మిల

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నేడు జిల్లాలో జరుగనున్న రెండవ విడత పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా,నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు 800 పోలీస్ అధికారులు,సిబ్బందితో భారీ బందోబస్తుతో పాటు అన్ని రకాల భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టామని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులకు,సిబ్బందికి ప్రత్యేక దిశానిర్దేశాలు జారీ చేశారు.ప్రతి గ్రామంలో శాంతిభద్రతలు క్షుణ్ణంగా పర్యవేక్షించేలా ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసినట్లు,ఎన్నికల కేంద్రాలను క్రిటికల్,సాధారణ, అత్యంత సున్నిత ప్రాంతాలుగా గుర్తించి,అదనపు బలగాలను మోహరించినట్లు వివరించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావు ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలు,అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని,శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.జిల్లాలోని అన్ని పోలీసు అధికారులకు,బందోబస్తు సిబ్బందికి తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే దిశగా కట్టుదిట్టంగా పని చేయాలని ఆదేశించారు.అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి,ఇన్స్పెక్టర్లు,ఆర్. ఐలు,ఎస్. ఐలు,ఆర్.ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా బిసి అభ్యర్థులను గెలిపించాలి

**ప్రజాపక్షం/ చెన్నూర్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి అభ్యర్థులను రాజకీయ పార్టీలకతీతంగా బిసి సమాజం గెలిపించుకోవాలని బిసి జెఎసి చెన్నూర్ కన్వీనర్ సిద్ది రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. చెన్నూర్ పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జనరల్ స్థానంలో బిసిలకు కేటాయించిన సీట్లలో రెబల్ గా పోటీ చేస్తున్న వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశానికి ఎంఆర్‌పిఎస్ సంపూర్ణ మద్దతు తెలిపిందని పేర్కొన్నారు. బిసిలు ఐక్య కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.



బిసి జెఎసి లీగల్ అడ్వైజర్ గా అడ్వకేట్ జెక సంజీవ్ ను ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కొండపర్తి వెంకటరాజం, రమేష్, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు మామిడి పోచన్న, అడ్డూరి సమ్మయ్య, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఏలేశ్వరం నరసింహ చారి, యాదవ సంఘం నాయకులు అక్కల రాజన్న యాదవ్, బిసి జెఎసి నాయకులు ఎర్రోళ్ల సంజీవ్, శివకృష్ణ, చట్లపల్లి శ్రీధర్, రాజేష్, ఎంఆర్పిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు మంత్రి మల్లేష్ మాదిగ, మండల అధ్యక్షులు సకినారం మల్లేష్ మాదిగ పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా జరిగిన నవోదయ ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** నిర్మల్ జిల్లాలో శనివారం జరిగిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలియజేశారు.ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు జరిగిన ఈ పరీక్షకు జిల్లాలో 1552 మంది విద్యార్థులకు గాను 1278 మంది విద్యార్థులు హాజరుకాగా 274 మంది మిద్యార్థులు గైరాజరయ్యారని.హాజరు శాతం 82.3 శాతం గా ఉందని వెల్లడించారు.నిర్మల్ పట్టణంలో సెయింట్ థామస్, వాసవి,విజయ హై స్కూల్ పాఠశాలల్లో,బైంసా పట్టణంలో ఆల్ ఫోర్స్,వేదం,వాసవి పాఠశాలల్లో ఈ పరీక్ష జరిగినట్లు పేర్కొన్నారు .పరీక్ష కట్టుదిట్టంగా నిర్వహించినట్లు తెలియజేశారు. పరీక్ష నిర్వహణను కాగజ్ నగర్ నవోదయ విద్యాలయానికి చెందిన అధ్యాపకులు సెంటర్ లేవల్ అబ్జర్వర్‌లుగా వ్యవహరించరని తెలిపారు.నిర్మల్ పట్టణంలోని సెయింట్ థామస్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించినట్లు వెల్లడించారు.జిల్లాలోని నవోదయ పరీక్ష కేంద్రాలను నిర్మల్ జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయక కమిషనర్ ముడారపు పరమేశ్వర్ సందర్శించినట్లు తెలిపారు.

# రికౌంటింగ్ కోరుతూ కలెక్టర్ ఫిర్యాదు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని మంగల్పాడ్ గ్రామ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన అరుగుల వనజ శనివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే రికౌంటింగ్ జరపాలని ఆమె తన ఫిర్యాదులో కోరారు. పోలింగ్ పూర్తైన తరువాత నిర్ణీత సమయానికి కౌంటింగ్ ప్రారంభం కాకుండా చాలా ఆలస్యంగా మొదలు పెట్టి అర్ధరాత్రి దాటిన తరువాత కౌంటింగ్ పూర్తి చేశారని అరగుల వనజ ఆరోపించారు. కౌంటింగ్ సందర్భంగా అధికారులు తప్పుడు సంఖ్యలను ప్రకటించారని, ఒకసారి ఒక సంఖ్య వెంటనే మరోక సంఖ్య చెప్పి తమను గందరగోళానికి గురి చేశారని ఆమె పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కాక ముందే కొంతమంది కరెంట్ తీసివేశారని, మరికొందరు బ్యాలెట్ పేపర్లను దాచిపెట్టారని ఆమె ఆరోపించారు. ఈ అవకతవకలను పరిగణలోకి తీసుకొని, వెం టనే మంగల్పాడ్ గ్రామంలో రికౌంటింగ్ జరిపించాలని సర్పంచ్ అభ్యర్థి అరుగుల వనజ జిల్లా కలెక్టర్‌ను అభ్యర్థించారు.జిల్లా కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

# అప్పుడు అక్రమం.. ఇప్పుడు సక్రమమా?

**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ప్రాంతంలోని 16వ వార్డులో అప్పుడు కట్టిన కట్టడం అక్రమమని కూల్చివేసిన అధికారులు ఇప్పుడు మాత్రం సక్రమం ఎలా అంటున్నారని మాజీ కౌన్సిలర్ తెలుగు లావణ్య దేవేందర్ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ రహదారి 363 విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారంతో పాటు ఆర్ అండ్ ఆర్ కాలనీ సమీపంలో 80 గజాల స్థలం కేటాయించామని గుర్తు చేశారు. బాధితుల్లో కొందరు హైవే సర్వీస్ రోడ్డు పక్కన మిగిలిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. గతంలో ఒక ఆర్‌ఎంపి డాక్టర్ విద్యుత్ స్తంభాన్ని కలుపుకొని నిర్మాణం చేపడితే అధికారుల ఆదేశాల మేరకు జెసిబితో కూల్చివేసిన విషయాన్ని ప్రస్తావించారు. రెండేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ ఎన్ హెచ్ పక్కన అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం



ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. హద్దు రాళ్లను తీసివేసి మున్సిపల్ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిని ప్రశ్నిస్తే ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్, సురేఖల పేర్లు చెబుతూ తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో అందరికీ అనుమతులు ఇవ్వాలని కోరారు.

# ఎన్నికైన సిపిఐ మాస్ లైన్ పార్టీ ఉపసర్పంచ్, వార్డు మెంబర్లుకి అభినందనలు..

### సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామ పంచాయతీలో వార్డ్ మెంబర్లుగా ఉపసర్పంచ్లుగా ఎన్నికైన చిట్యాల పెద్దిరాజు,కొలాం గూడ గ్రామ పంచాయతీలో వార్డ్ మెంబర్ గా ఏకగ్రీవమై గ్రామ ఉప సర్పంచ్ గా ఎన్నికైన సిడాం సోనే రావు,లను అలాగే కోలాం గూడ జిపి లోని 1వార్డ్ మెంబర్ గా ఎన్నికైన లాల్ రావు,పాత తర్లపాడు గ్రామ పంచాయతీలోని 1వ వార్డ్ మెంబర్ గా ఎన్నికైన కొమరం మంతు,బావాపూర్(కె) గ్రామంలోని 7వ వార్డు నుండి గెలిచిన వార్డు మెంబర్ కుర్మా లింగవ్వ లకు సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో ఖానాపూర్ పార్టీ కార్యాలయంలో వారికి అభినందనలు తెలియజేయడం జరిగినది.ఈ సందర్భంగా నందిరామయ్య మాట్లాడుతూ ఎన్నిక కాబడిన ఉపసర్పంచ్లు,వార్డు మెంబర్లు వచ్చే ఐదేళ్లలో ప్రజల పక్షాన నిలబడి గ్రామాల అభివృద్ధికి వార్డుల పరిధిలో అభివృద్ధికి పాటుపడాలని,స్వార్థ ప్రయోజనాలకి లోను కాకుండా నిజాయితీగా ఉండాలని,ప్రజల్లో మంచి గుర్తింపు పొందాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండలం మాస్ లైన్ పార్టీ నాయకులు జక్కుల రాజన్న,ఆయా గ్రామాల పార్టీ సభ్యులు నాయకులు దుర్వ సంతోష్,రమేష్,నాగో రావు,తోటపెల్లి రాజేష్,నవీన్,శేఖర్,గోనే లచ్చన్న, పాల్గొన్నారు.



# రాంనగర్ కాలనీలో ప్రజాప్రతినిధులకు సన్మానం

**ప్రజాపక్షం/ జన్నారం :** పొనకల్ గ్రామపంచాయతీ రాంనగర్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను శనివారం ఘనంగా సన్మానించారు. జన్నారం మండలంలోని పొనకల్ రాంనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, వార్డు మెంబర్లు పిల్లి మల్లయ్య సుజాత, జాజల లత శ్రీకాంత్ లను శాలువాలతో సత్కరించారు. ప్రజల విశ్వాసంతో గెలుపొందినవారు గ్రామాభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని కాలనీ వాసులు ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబా



టులో ఉండి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని సన్మానితులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

# నూతన సర్పంచ్‌లను సన్మానించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు దినేష్ కులాచారి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు శనివారం జిల్లా పార్టీ అధ్యక్షులు దినేష్ కులాచారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎడపల్లి, ఠానాకలాన్, బ్రహ్మణపల్లి గ్రామాలకు చెందిన కొత్త సర్పంచ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను అభినందించిన జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి వారందరినీ శాలువాలతో సత్కరించి గౌరవించారు. గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు.

# పోలియే,ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఆపన్న హస్తం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణం శాంతి నగర్ ఒడ్డె వాడ కాలనీకి చెందిన సురా రాజేష్ గత కొన్ని సంవత్సరాలుగా పోలియో,ఫిట్స్ వ్యాధితో బాధ పడుతున్నాడు. అన్నా విషయం తెలుసుకొని ఇతనికి చికిత్సకు కావాల్సిన మందులకు అయ్యే ఖర్చులను ఓకే ఆర్ ఫౌండేషన్ ద్వారా అందించారు.ఈ సందర్భంగా ఓకే ఆర్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ సుర రాజేష్,తండ్రి చనిపోవడంతో కుటుంబ భారం మొత్తం తల్లి లక్ష్మి చూసుకుంటుంది కుమారుడికి అయ్యే వైద్య ఖర్చులకు తన తీవ్ర ఇబ్బందులు పడుతున్నదన్న విషయం తెలుసుకొని,గత వారం రాజేష్ కి తీవ్ర ఆరోగ్య సమస్య తలెత్తడంతో నిర్మల్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లడం జరిగిందని,చికిత్స సమయంలో అత్యవసరమైన మందులు అవసరం కావడంతో ఒకేఆర్ ఫౌండేషన్ ను సంప్రదించగా ఆసుపత్రి డాక్టర్‌తో మాట్లాడి చికిత్స అందచేసి తనకు నెల రోజులకు సరిపడా మందులు అందివ్వడం జరిగింది.వారి ఇంటికి వెళ్లి వారితో తదుపరి మూడు నెలల ఆసుపత్రి చికిత్సకు అవసరమయ్యే ఖర్చులను కూడా అందివ్వడం జరుగుతుందని ఓకే ఆర్ ఫౌండేషన్ సభ్యులు తెలియజేశారు. పంబాల భీమేష్,దూడం శ్రీనివాస్,బిసి రమేష్,ఆడెపు రవి తదితరులున్నారు.

# నిర్మల్ వాసవి వరల్డ్ స్కూల్‌కు ఫ్యూచర్ రెడీ స్కూల్ అవార్డు

## భవిష్యత్తుకు సిద్ధం చేసే విద్యకు అరుదైన గౌరవం




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలోని ప్రతిష్టాత్మక వాసవి వరల్డ్ స్కూల్కు,అరుదైన గౌరవం దక్కిది. ఈ పాఠశాల ఫ్యూచర్ రెడీ స్కూల్ అవార్డు2025 పురస్కారాన్ని అందుకుంది భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక బోధనా పద్ధతులను అమలు చేస్తూ,విద్యార్థుల్లో ఉత్తమ విలువలు,నాయకత్వ లక్షణాలు,సమకాలీన నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నందుకు గాను ఈ ప్రతిష్టాత్మక అవార్డు వాసవి వరల్డ్ స్కూల్ కు లభించింది.ఈ గౌరవప్రదమైన అవార్డును రెవెన్యూ,హౌసింగ్,సమాచార, ప్రజా సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా పాఠశాల యాజమాన్యం అందుకుంది సమిష్టి కృషికి నిదర్శనం,ఈ సందర్భంగా అవార్డును స్వీకరించిన పాఠశాల కరస్పాండెంట్ పోతా రెడ్డి,ప్రిన్సిపాళ్లు రాజకుమార్,సుహాసిని,శ్రీనివాస్ శెట్టి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ,ఈ ఫ్యూచర్ రెడీ స్కూల్ అవార్డు2025 కేవలం పాఠశాల యాజమాన్యాన్నికే కాకుండా,ఉపాధ్యాయులు,విద్యార్థులందరి సమిష్టి కృషి కి,అంకితభావానికి లభించిన నిదర్శనమని తెలిపారు. విద్యార్థులను తీర్చి దిద్దడంలో పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు చూపుతున్న నిరంతర అంకితభావం ఈ అవార్డు ద్వారా మరోసారి నిరూపితమైంది.వాసవి వరల్డ్ స్కూల్‌కు ఈ పురస్కారం విద్యారంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా,భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్య అందించడంతో తమ నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

# విద్యార్థులకు ఘనంగా గజ్జల పూజ



**ప్రజాపక్షం/ఎడపల్లి:** సంప్రదాయ నృత్య కళలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ అభ్యాసానికి అధికారికంగా నాంది పలికే పవిత్రమైన వేడుక, గజ్జల పూజను నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ధనిత్ డాన్స్ ఆధ్వర్యంలో నృత్య గురువు సతీష్ మాస్టర్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జాన్కంపేట్ గ్రామ శివారులోని స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వేదికగా జరిగిన ఈ వేడుకలో సంప్రదాయ నృత్యాలను అభ్యసిస్తున్న చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువు సతీష్ మాట్లాడుతూ... గజ్జల పూజ అనేది విద్యార్థులు తమ కాళ్లకు గజ్జెలు కట్టుకొని, విఘ్నేశ్వరుడు, నటరాజ స్వామికి పూజలు చేసి, తమ శిక్షణను అధికారికంగా ప్రారంభించే ఒక పవిత్రమైన వేడుక అని ఇది వారి నృత్య ప్రస్థానంలో ఒక ముఖ్య ఘట్టం అని తెలిపారు. ధనిత్ డాన్స్ అకాడమీ ద్వారా సతీష్ మాస్టర్ చిన్నారులకు ముఖ్యంగా పేరిణి నృత్యం వంటి అంతరించిపోతున్న సంప్రదాయ నృత్యాలను నేర్పిస్తూ ముందుకు సాగుతున్నారు. సమాజంలో ప్రస్తుతం మరుగున పడుతున్న ఈ నృత్య రూపాలను తిరిగి యువతకు అందించాలనే లక్ష్యంతోనే తాను ఈ అకాడమిని నడుపుతున్నానని ఆయన అన్నారు. నేటి యువత ఎక్కువగా కలలు, నృత్యాలు నేర్చుకోవడం లేదు. మేము ఉన్నంత వరకు కొంత వరకైనా ప్రస్తుత యువతకు నృత్య ప్రదర్శనలో నేర్పడం జరుగుతుందని సతీష్ మాస్టర్ తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. అకాడమీలో శిక్షణ పొందిన ఎంతో మంది విద్యార్థులు ఇప్పటికే ఉన్నత స్థాయికి చేరుకున్నారని గురువు సతీష్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.గజ్జల పూజ అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు చూపరులను, వారి తల్లిదండ్రులను ఎంతగానో అలరించాయి. ప్రతిభ అందరి ప్రశంసలు అందుకుంది. మాస్టర్ యశశ్రీ, నృత్య విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

# జీవితంలో కష్టాలను ఎదుర్కొంటూనే విధి నిర్వహణ

## ఫస్ట్ సౌత్ ఆసియన్ పారా త్రో బాల్.. ఛాంపియన్షిప్ టోర్నీలో గోల్డ్ మెడల్

## అర్చన ను సత్కరించిన వెల్ఫేర్ సొసైటీ

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జీవితంలో కష్టాలను ఎదుర్కొంటూనే విధి నిర్వహణలో రాణిస్తూన్న అర్చన క్రీడల్లో మరింత స్థాయికి ఎదిగి విజయాలను సొంతం చేసుకోవాలని సిరిసిల్ల వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది శాంతి ప్రకాష్ శుక్ల ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీలంకలో ఈనెల 6,7 తేదీలలో జరిగిన ఫస్ట్ సౌత్ ఆసియన్ పారా త్రో బాల్ ఛాంపియన్షిప్ మెన్ అండ్ ఉమెన్ టోర్నీలో పాల్గొని గోల్డ్ మెడల్‌తో శనివారం సిరిసిల్లకు చేరిన అర్చనను సిరిసిల్ల వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఒలంపిక్ క్రీడల్లో అవకాశం దక్కించుకోవాలన్న తపనతో ముందుకు సాగుతున్నానని అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన దివ్యాంగుల వాలీబాల్ క్రీడాకారిణి మిట్టపల్లి అర్చన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సిరిసిల్ల స్త్రీ శిశు సంక్షేమ వయోవృద్ధుల దివ్యాంగుల శాఖలో మల్టీ టాస్క్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగంతో విధులు నిర్వహిస్తున్న అర్చన పారా గేమ్స్ లో గ్రామీణ స్థాయి నుండి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో ఎంపికై జాతీయస్థాయికి ఎదిగారు. అక్కడినుండి అంతర్జాతీయ సాయి క్రీడల్లో అవకాశం దక్కించుకున్నారు. పేదరికంలో ఉండి ఎం



ఎ సోషియాలజీ, బీ ఈడి చదివిన అర్చన తన ఇద్దరు పిల్లలతో సిరిసిల్ల అర్బన్ చంద్రంపేట గ్రామంలో నివసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు శాంతి ప్రకాష్ శుక్ల, రాధాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు, విశ్రాంత ఉపన్యాసకులు ఝూన్సీ శుక్ల, ఎల్లే సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌గా గెలిపించండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

## చందోలి సర్పంచ్ అభ్యర్థి జక్కుల పావని దస్తగిరి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చందోలి గ్రామానికి చెందిన జక్కుల పావని దస్తగిరి గ్రామ అభివృద్ధికై సర్పంచ్ గా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.ఎన్నికల ప్రచారంలో ఆమె దూసుకుపోతున్నారు .గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలతో యువత ,మహిళలు,వృద్ధులతో మామేకమై గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ తనదైన శైలిలో ప్రచారాన్ని సాగిస్తూ ముందుకు వెళ్తున్నారు.గ్రామానికి సేవకురాలిగా ముందుకు వస్తున్న మీ ఇంటి బిడ్డగా వస్తున్న మీ కష్టసుఖాలలో పాలు పంచుకుంటా ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని అహర్నిశలు కష్టపడుతా మీ అందరి సహాయ సహకారాలతో సమిష్టిగా ,గ్రామ అభివృద్ధి నా ప్రధాన లక్ష్యమని అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని, తన భర్త జక్కుల దస్తగిరి కి ఉప సర్పంచ్ గా పనిచేసిన అనుభవం ఉందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో తాను గ్రామంలో సమస్యల పరిష్కారానికి తన శాయశక్తుల కృషి చేస్తానని ,గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని సర్పంచ్ అభ్యర్థి జ క్కుల పావని ఓటర్లకు వివరించారు .ఈ సందర్భంగా పనిచేసే వారికే పట్టం కట్టాలని కోరుతూ ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించారు.

# గ్రామపంచాయితీ ఎన్నికలకు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం /వేలేరు :** రెండవ విడుత గ్రామపంచాయితీ ఎన్నికల నేపద్యంలో నేడు జరిగే ఎన్నికలకు సర్వం సిద్దంచేశామని ఎంపిడిఓ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. ఈసంధర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మండలంలోని పన్నెండు గ్రామపంచాయితీలకు రెండు గ్రామపంచాయితీ సర్పంచ్‌లు ఏకగ్రీవం కాగా మిగతా గ్రామాలలో జరిగే ఎన్నికలకు శనివారం ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామాగ్రిని తీసుకెల్లడం జరిగిందని అన్నారు.ఎన్నికల సామాగ్రిని డిఆర్‌డిఓ,స్టేట్ ఎన్నికల పరిశీలకులు,డిసిపి,ఎసిపి,ఎంఆర్‌ఓ కోమి,మండలవిద్యా శాఖ అధికారి మొగిళిచెర్ల చంద్రమౌళి తదితర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# డబ్బులు పంపిణీ చేస్తున్న వ్యక్తులను పట్టుకున్న ఎన్నికల ఫ్లైయింగ్ అధికారి



**ప్రజాపక్షం / వేలేరు :** గ్రామపంచాయితీ ఎన్నికల సంధర్భంగా మండలంలోని వివిధగ్రామాలలో విచ్చల విడిగా డబ్బులు,మద్యం పంపిణీ చేస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు శనివారం వేలేరు మండలంలోని వివిధ గ్రామాలలో ఫ్లైయింగ్ శాఖ అధికారి అరవింద్ వివిధ గ్రామాలలో పర్యవేక్షించగా మల్లికుదుర్ల గ్రామంలో కాంగ్రేస్ పార్టీకి చెందిన ఓవ్యక్తి డబ్బులు పంపిణీచేయుచుండగా అతని వద్ద పదివేల రూపాయలు పట్టకోవడం జరిగిందని తెలిపారు.

# ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి భూక్య వెంకన్న



**ప్రజాపక్షం/ఖానాపూర్:**ఖానాపురం మండలలోని యాపచెట్టు తండా గ్రామ పంచాయతీ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి భూక్య వెంకన్న గెలుపు కోసం నర్సంపేట మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ యాపచెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని రేవతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గతం కంటే బిఆర్ఎస్ పార్టీ గ్రామాల్లో విస్తరించిందని కేంద్రం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి రెండు సంవత్సరాల స్థానిక సంస్థల ఎన్నికలను కాలయాపన చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందకుండా పోయాయని ఎన్నికలు చేయకపోవడం వలన సుమారు 900 కోట్లు నష్టం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు పలు హామీలు చేసిందని ఇప్పటి వరకు అమలు చేయలేదని బిసి రిజర్వేషన్ కూడా పూర్తి చేయలేదని, కేవలం కాలయాపన చేస్తుందని సమావేశంలో అన్నారు. అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్ పార్టీ అధికారం కోస్తేనే జరుగుతుందని బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ వార్డు అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు రెడ్డి నాయక్, బద్రు నాయక్, శీను నాయక్, హేమానాయక్, తదితరులు పాల్గొన్నారు.